# ఆమెను గూర్చి

శ్రీ వలివేటి బాలకృష్ణశర్మ

ఆది శ్రావణమాసం. వర్షం మూడు నాలుగు గంటలనుంచి విడవకుండా కురుస్తోంది. రైలు ఎనిమిదిన్నరకి స్టేషనులో ఆగింది. ఆ స్టేషనుకూడా చాలా చిన్నది. ఎవరూ ప్రయాణికులూ చాలా మంది లేరు. కూలివాళ్ళూ కనబడలేదు. తొడమీద పడుక్కుని నిద్రపోతూన్న మణిని లేపి ఆడవాళ్ళ కంపార్టుమెంటులోంచి దిగాను. సామాను ఒకటొకటే తీసి ప్లాట్ ఫారంమీద వేశాను. రైలు కదిలిపోయింది. ఒకకూజా మామణి ఆడుకునే బొమ్మలపెట్టె మాత్రం ఉండిపోయినై. వర్షానికి నాచీర పూర్తిగా తడిసిపోయింది. ఇంతలో—

'ఏవూరు వెళ్తారమ్మా?' అని అడిగాడు ఎదురుగా బండివాడు కాబోలు. చేతులో కొరడాతో వజవజవణుకుతూ తలమీదనుంచీ కప్పుకుని నుంచున్నాడు. ఆ బండి మాటాడి సామానువేయించి, ఏడుస్తూన్న మణికి బట్టలుమార్చి మెల్లగా బండిలో కూచున్నాము. బండిలోంచి వాననీరు మీదపడుతోంది. నాలుగుమైళ్ళుంది బండిప్రయాణం. హాయిగా మద్రాసులో ట్రాంలో కూచున్నట్టుగా వుంటుందా? పుట్టుక దగ్గర్నుంచీ పట్నాల్లోనే గడిపి అందులోనూ పదేళ్ళ నుంచి మద్రాసులో గడిపిన నాకు రాబోయే ఈ పల్లెటూరు బ్రతుకు ఎల్లా ఉంటుందో అని భయం ఓప్రక్క, యుద్ధభయంవల్ల మేం వచ్చేస్తున్నా, ఆయనగతిఎల్లావుంటుందో వేళకు భోజనంకూడా దొరుకుతుందో లేదో అని ఆవేదన ఓప్రక్క—చాంతాడులాగా వెధవరోడ్డు ఎప్పటికీ పూర్తికాదు.

ఏదో అలాగే ఆలోచిస్తూ పొలాలమీద పడుతూన్న వర్షంకేసి చూస్తున్నా, మణి నిద్రపోతూంది.

'ఎవరింటికి వెళతారమ్మా' అని అడిగాడు బండివాడు చుట్ట చేత్తోపట్టుకుని.

'రాచూరివారింటికోయ్' అన్నాను.

'ఏ రాచూరివారు?' ఆశ్చర్యపోయాడు.

'పాపయ్యగారిల్లు తెలీదోయ్?' మా మామగారు బ్రతికివుండే రోజుల్లో ఆవూరిలో డిక్టేటరుకన్నా హెచ్చు అధికారంలో వుండేవాడు.

"వారు మీకేమవుతారండీ?" అన్నాడు.

'మామగారు'

'అలగా అండి, తమరు చెన్నపట్నం నుంచి వస్తున్నారు గదండీ?' అన్నాడు. మా కుటుంబవిషయాలు పూర్తిగా తెలిసిన వాడిలా వున్నాడు.

'అవునోయ్ అక్కడ బాబుగారు పని చేస్తున్నారు గదూ? ఇప్పుడు యుద్ధభయం వల్ల ఆడాళ్ళనీ పిల్లల్నీ పంపించేసి, మగాళ్ళు మాత్రం ఉద్యోగాలు చేస్తున్నారు'

"చిత్తం, గానండి ఆయిల్లు పూర్తిగా వదిలిపెట్టి చాలాకాలమయిందిగదా ఏపురుగూ బుట్రా వుంటుందో తమరుఈరాత్రి ఆయింటో పడుకోవడం బాగోదండి?"

"ఆమాట నిజమేగాని మరెవ్వర్నీ తెలీదే?"

"నే చెబుతా రండి." అంటూ బండి ఓ యింటిముందు ఆపి తలుపుతట్టాడు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"పాపయ్యగారి కోడలా—శాంతమ్మ?" ఒక ఆడగొంతుగలావుంది ఆవిడకి. నాపేరు ఎల్లా తెలిసిందో?

"అవునండి" బండివాడు జవాబు.

ఆవిడ బండిదగ్గరకు వచ్చింది. నన్ను చూసి ఎంతో ముచ్చటపడింది. ఆవిడని పదేళ్ళక్రిందట నాపెళ్లితో తెలుసును గొడుగు వేసి మమ్మల్ని తీసుకువెళ్లి ఎంతో ఆదరణ చూపింది. ఆ అర్ధరాత్రి ఆమె నిప్పుచేసి మాకు కాఫీ కాచియిచ్చింది. ఆ సమయంలో కామమ్మగారే అక్కడ లేకపోతే ఏం జేసి వుందునా అని ఆలోచించేలాగ చూసింది.

ఆమర్నాడు మా మామగారు 70 సంవత్సరాల క్రిందట కట్టిన ఇంట్లోకి వెళ్ళాను. రెండు రోజుల్లో ఇంట్లో, నాక్కావలసిన సవుఖ్యాలన్నీ కుదిరాయి. ఆయన లేరన్న విచారమూ, మద్రాసులో ఏం చిక్కులు పడుతున్నారో అనే ఆలోచనా తప్ప ఆ యింట్లో నాకు చాలా ఆనందంగా వుండేది. మద్రాసు నుంచి వారానికి ఒక ఉత్తరం రెగ్యులర్‌గా వచ్చేది, ఒక్క రోజులో పదిసార్లన్నా చదివేదాన్ని ఆ ఉత్తరం.

మధ్యాహ్నం రెండు గంటలకి నేనూ మణీ కలిసి చింతచెట్టు నీడలో కూచుని ఆడుకునేవాళ్ళం. గాలికి ఊగే చింతచెట్టు ఆకుల్లోంచీ సూర్యకిరణాలు మణి గౌను మీదా, ముంగురుల మీదా, నాపైట మీదా పిల్ల కెరటాల్లాగా ఊగుతూ వుండే. ఆనందానికి శరీరం పులకరించేది. మెరీనాలో అల్లాంటి సవుఖ్యం లేకపోయింది నాకు.

వర్షం వస్తేకూడా మాకు ఆనందంగానే ఉండేది. అరుగుమీద కూర్చుని పనికిరాని కాగితాలన్నీ పడవలుకట్టి నీట్లోవదలడమూ,

వర్షం వెలిసాక, గర్భిణీస్త్రీలాగ నీటితో నిండిన పొలాల్ని చూడాలని మణీ నేనూ షికారు బయలుదేరడమూ, ఇవన్నీ కామమ్మ గారికి చాలా వింతగా ఉండేది.

"శాంతమ్మా! నీకు ఇంకా కుర్రతనం పోలేదు సుమా!' అనేది.

"కుర్రదాన్ని కాక ఏమంత పెద్దదాన్నయా నండీ?" అని నవ్వేదాన్ని.

ప్రజలంతా నన్నుగురించి వింతగా చెప్పు కుంటున్నారనీ అలా షికార్లు చెయ్యకూడ దనీ ఏవో బోధించేది. జాగ్రత్తగావిని నాకు తోచినట్టు తిరిగేదాన్ని.

ఆవాళ మా పొరుగువారింట్లో సత్యనారా యణవ్రతమట. వారి పెద్దకోడలు కాబోలు వచ్చి చూడటానికి రమ్మనినాముఖాన్న బొట్టు పెట్టింది. నామెళ్ళో చంద్రహారాలకి ఎంత బంగారం పట్టిందో నాకాళ్ళపట్టీలకి ఎంత వెండి పట్టిందోకూడా తెలుసుకుని ఆ వస్తు వులు తయారుచేసిన కంసాలిపేరుకూడా తెలుసుకుని వెళ్లింది.

మధ్యాహ్నం రెండుగంటలయింది. మణి ఎదురుగానుంచోనిడ్యాన్సుచేస్తూంది. కామమ్మ గారు తలుపుతోసి.

"ఏం శాంతమ్మా, వాళింటో వ్రతం జరుగుతూవుంటే ఇలా కూచున్నావేం" అంది.

"ఏంజెయ్యమన్నారు? మీరూకూచోండి." అన్నాను.

"వ్రతం వినడానికి రావూ?"

"పోనిస్తురూ, వాళ్ళు చేస్తూవుంటే మనం వినేదేమిటి? కూచోండి" అని నిర్లక్ష్యంగా అంటే—దానివల్ల వచ్చేపుణ్యాన్ని ఆవిడ పావుగంటసేపు బోధపరిచి లాక్కెళ్లింది.

అక్కడ చాలామంది ఆడాళ్ళూ నలుగు రైదుగురు మగాళ్ళూ కూచున్నారు. అందరూ నాకేసి చాలా వింతగా చూసారు. వాళ్లంతా పెద్దపెద్ద పట్టుచీరలు కట్టుకుని తల నున్నగా దువ్వుకుని ఒకొక్క మునుగుపువ్వులు జడల్లో పెట్టుకుని మంగళహారతులు మననం చేసు కుంటూ కూచున్నారులావుంది. నేనుమాత్రం నల్లంచుల సాదాఖద్దరు తెల్లచీర కట్టుకుని, తెల్లఖద్దరు ముతుకు రతికతోఉన్నాను. చేతు లకి గాజులూ, మెళ్ళో చంద్రహారం, చెవు లకు లోలక్కులూ, కాళ్ళకు పట్టీలు తప్ప మరేమీ ఆభరణాలూ లేవు. తలకూడా చెదిరి పోయి నుదుటిమీదకు ఎగురుతోంది. మంచి పట్టుచీర కట్టుకోనందుకు కామమ్మ గారు నాకు మాత్రం వినబడేలాగ కోప గించింది. యుద్ధం పోయాక మళ్ళా నన్ను మద్రాసు తీసుకెళ్ళడానికి ఆయన వచ్చినప్పుడు తప్పకుండా వ్రతం చేస్తానని నాచేత ప్ర మాణం చేయించింది.

పీటలమీద ఇద్దరు దంపతులు కూచున్నారు. 'ఆవిడ సుసర్లవారి చిన్న కోడలూ, ఆయన చిన్నకొడుకూనూ' అని కామమ్మ చెప్పింది. ఆయన తెల్లని పట్టు పంచ కట్టుకుని కలశంముందు కూచున్నాడు. పురోహితుడు మంత్రాలు చెబుతున్నాడు. ఆయన మధ్య మధ్య జంధ్యం సవరించు కుంటూ పూజ చేస్తున్నాడు. వస్త్రం కోసం తలంటిపోసుకున్నాడు కాబోలు జుత్తు గాలికి బాగా ఎగురుతోంది, ఆయన దేవుడిముందు కూచున్నాడు. హటాత్తుగా ఎందుకో వెనక్కు మావైపు తిరిగాడు. నా హృదయం చేత్తో కదల్చినట్టు అయింది. అంతవరకూ ఏదో మహాపరాధమూ దొంగతనమూ చేస్తూ వుంటే, అందఱూ పట్టుకున్నట్టూ ఏదో శిక్షవెయ్యబోతూన్నట్టూ ఫీలయ్యాను.

వ్రతం పూర్తయింది. ఆయనలేచి గది లోకి వెళ్ళిపోయాడు. ఇంకా నేను గదివంకే చూసాను. షర్టు తొడుక్కుంటూ ఆయన నావైపు చూశాడు. తలవంచుకుని మా మణిని దగ్గరగాలాక్కున్నాను. ఆయనభార్యకాబోలు కాఫీ వెండిగ్లాసుతో తీసుకుని వెళ్తూంది. కామమ్మ గారు నన్ను నెమ్మదిగా మాయింటి దగ్గర దిగవిడిచారు.

మర్నాడు——

ఆయనపేరు జగన్నాథం. వయస్సు ముప్ఫయి లోపుగా వుంటుంది. సాయంత్రం ఆరుగంటలకు మణిని ఎత్తుకుని మా తలుపు తట్టాడు. మణికి తలమీద గాయం తగి లింది. రక్తం బాగా వస్తూంది. కంగారుగా ఆయన చేతులోంచీ మణిని లాక్కున్నాను. మణి గుక్కపట్టి ఏడుస్తోంది. ఏం జెయ్యా డానికీ తోచలేదు. వెధవ పల్లెటూళ్ళో హాస్పిటలా, మన్నా? ఎప్పుడో తెచ్చుకున్న ఐడన్ తెచ్చి ఆ జగన్నాథంగారే కాస్త గాయానికిపేసి కట్టుకట్టారు.

ఆరాత్రి నేనూ కామమ్మగారూ నిద్ర పోలేదు. మణికి రాత్రి బాగా జ్వరం వచ్చింది. నాకు ఏమీతోచలేదు. మర్నాడు మద్రాసు ప్రయాణానికి నిశ్చయించుకున్నాను.

ఉదయాన్నే జగన్నాథంగారు వచ్చారు.

'అమ్మాయికి ఎలా వుందండీ?' ఎంతో ఆప్యాయంగా అడిగారు.

'తమ దయవల్ల ప్రమాదం తప్పిందండి' అని నేలవైపుచూస్తున్నా. ఆయన్ను మొదట సత్యనారాయణవ్రతం చేస్తూ వుండగా చూశాను.

'ఇవాళ మద్రాసు పోవాలనుకుంటున్నాను. ఇక్కడ వైద్యసహాయం ఏమీలేటుగదా అంది!'

'మీకు యిష్టమయితే దగ్గరగావున్న పట్నంనుంచి డాక్టర్ని తీసుకొనిరావచ్చును.'

'మంచి డాక్టర్లు వుంటారా!'

'నాలుగురోజులపాటు చూడండి.'

అలాగే ఆయన వెళ్ళి డాక్టర్ని వెంట బెట్టుకు రావడమూ నాలుగయిదురోజుల్లో ఆ గాయం బాగుపడేలాగ ధైర్యం కలగడమూ జరిగాయి.

నేను వంటింట్లో హార్లిక్సు కలుపు తున్నాను. పెద్ద ధ్వని అయింది. సావట్లో చూస్తే మణి మంచం మీద నుంచి కిందకు

దొర్లింది. తలకు మళ్ళా గాయం తగిలింది. జగన్నాంథం గారికి కభురుచేశాను. వెంటనే సైకిలుమీద వెళ్ళి డాక్టర్ను తీసుకుని వచ్చారు.

ఆ రాత్రి జగన్నాంధంగారు మా యింటోనే ఉండి పోయారు.

మణి బాధగా మూలుగుతూంది. జ్వరం తీవ్రంగా వుంది.

'మణీ కొంచం కాఫీ త్రాగుతావా తల్లీ' నెమ్మదిగా పిలిచాను.

'నాన్న....నాకు నాన్న కావాలి.' కళ్ళు మూసుకునే నాన్నా అని పిలిచింది.

ఏం చెయ్యాలో తెలీక దిగాలుగా జగన్నాధం మొహంవైపు చూశాను. ఆయనా శూన్యంగా చూశాడు.

'నాన్నా....నన్ను ఎత్తుకోవూ?' మణి మళ్లా పిలిచింది.

జగన్నాధం లేచి మణి మంచంమీద ఓరగా కూచున్నాడు.

'మణీ....' నెమ్మదిగా పిలిచాడు.

'నాన్నా....వచ్చావా .... ఒక్కమాటు నన్ను ఎత్తుకుని షికారు తిప్పవూ?" చేతులు చాచింది.

జగన్నాధం సంశయించాడు.

'ఎత్తుకోండి ఒక్కసారి....' దీనంగా.... అన్నాను.

ఆయన మణిని తొడమీద కూర్చొబెట్టుకున్నారు. ఫ్లాస్కులోకాఫీ గ్లాసులోపోసి ఆయన చేతికిచ్చాను. కొద్దిగా త్రాగింది. ఆమెకు చిన్నకునుకు పట్టాక జగన్నాధం గారు ఆరాత్రి ఒంటిగంటకు ఇంటికి వెళ్ళిపోయారు.

మర్నాడు జగన్నాధంగారు వస్తే—

'నాన్నా' అని పిలిచింది మణి ఆతృతగా.

'ఎలక్ట్రిక్ షాక్' తగిలినట్టు ఫీలయ్యాడు.

ఆయన వెళ్లి మళ్లా మణి మంచంమీద కూచున్నారు. మణి మొహంమీద చెయ్యి వేస్తూ—

'జ్వరం తగ్గిందా' అన్నారు.

'ఉదయానికొక్కస్త నెమ్మదిగా వుంది. గాయం మాత్రం నొప్పిగావుందని ఏడ్చింది' అన్నాను.

జగన్నాధాన్ని కావిలించుకుని మణి ఏడ్చింది.

'మా యింటోనే ఎప్పుడూ వుండిపోకూడదూ? నాన్నా....నన్ను విడిచి పోతావా'?అంటూ—

డాక్టరుగారు వచ్చారు. ఈమాటలు విన్నారేమో అని భయంవేసింది నాకు. కట్టు విప్పి గాయంకడిగాక మళ్లా కట్టుకట్టివెళ్లిపోతూ—

'మీ అమ్మాయిని తీసుకుని రేపు మీరే రావలసివుంటుందేమోనండీ'?—అన్నాడు డాక్టరుగారు—

'ఉదయం మీరు రాకపోతే అలాగే చేస్తాం లెండి", అంటూ లోనికివచ్చాడు జగన్నాధం గారు. డాక్టరుగారు సైకి లెక్కారు.—

డాక్టరుగారు ఉదయం రాలేదు. మధ్యాహ్నం నేను వెళతానంటే వినకుండా మణిని తీసుకుని ఆయనే వెళ్లాడు.

క్రమంగా గాయం మానింది.

ఇప్పుడు మణీ జగన్నాధంగారూ ఒక్కక్షణం వదిలిపెట్టివుండలేకపోయారు. మణి భోజనం చేసేవరకూ జగన్నాంధంగారు మా యింటోనే పడకకుర్చీలో కూచోవాలి. ఆయనతోకలిసి మణి వాళ్ళింటికి వెళ్ళాలి. మళ్ళా ఆయన భోంచేసి మాయింటికివచ్చి మణి నిద్రపోయాక వెళ్లిపోవాలి. ఇలా జరిగేది ప్రతి రోజూ.

అవాళరాత్రి—బయట వర్షం కురుస్తోంది. నాతొడమీద తలపెట్టి మణి మంచంమీద పడుకుంది. ఎదురుగా పేం కుర్చీలో సిగరెట్టు కాలుస్తూ జగన్నాధంగారు కూచున్నారు. ఏవో కబుర్లు చెప్పుకుంటున్నాము. మా మాటలు వింటూనే ఎప్పుడు నిద్రపోయిందో మణి, మేము మాత్రం ఇంకా అలాగే మాటాడుతున్నాము.

కొన్ని పుస్తకాలు నేనూ ఆయనా చదివాం.

కొన్ని సినీమాలు నేనూ ఆయనా చూసాం. ఇలాగా మాకు కొన్నికొన్ని అభిప్రాయాలు మాట్లాడుకుందుకు ఎంతో అవకాశాన్ని యిచ్చాయి.

మా సంభాషణ కేవలమూ మణిని నిద్రపుచ్చడానికే కాకుండా చివరకు మాకూ నిద్రవంటి మైకాన్ని తెచ్చేది. ఏం చేస్తూన్నదీ తెలుసుకోకుండా అలాగే మాటాడుతూ కూచున్నాం.

వర్షం వెలిసాక చెదిరిపోయిన మేఘాల్లోంచి అష్టమచంద్రుడు తొంగిచూస్తూ కిటికీ చువ్వల్లోంచి వెల్లువలాగా మణి గౌనుమీదా, నా చీరమీదా వెన్నెలవిరుల్ని వెదజల్లుతున్నాడు.

కిటికీలోంచి బయటకు చూశాను. వర్షానికి రాలినమాలతీపువ్వులు నక్షత్రాల్లాగా మెరుస్తున్నాయి. మణి తల నాతొడమీదనుంచి మెల్లగా పరుపుమీదకు దించి కిటికీదగ్గరావెళ్లి మోచేతులు ఆనించి, చెట్ల లేత ఆకులమీద వర్షపునీటితో ప్రతిఫలిస్తూన్న వెన్నెల కిరణాల్నిమతిలేకుండాచూస్తున్నాను.సగంకాల్చిన సిగరెట్టుపడి చెట్ల ఆకులు కదిలాయి. వెనక్కు తిరిగి చూశాను. నా వెనకనే నుంచున్నాడు జగన్నాథం.

పిచ్చిదానిలాగ నుంచోని మాసిన తెల్లషర్టుని ఆయన పెట్టుకున్న క్రిమంట్స్ బొత్తాయిలు చూస్తున్నాను. చూస్తూవుండగానే ఆయన బలంకొద్దీ చేతుల్లో నన్ను నలిపి నాభుజాలు చుటినట్టుగా ఫీలయ్యాను. ఆయన మాత్రం ఇంకా అలా నుంచున్నారు, కాసేపట్లో ఆయన పెదిమెలు నా నుదుటిమీద వణకుతున్నాయి. ఇంకా ఆయన మొహంలో వింతగా చూస్తున్నాను. ఆయన ఏం జేసినా కాదనగలిగే శక్తి పోయింది.

మర్నాడు కాలవకు నీళ్ళకోసం వెళ్లాను.

'దానికేం బాధలే? ఉన్నాడు గాను సర్లవారి అబ్బాయి.'

'ఎవరు? జగన్నాధమా?"

'రామ, రామ-ఈమె ఎంత పతివ్రతగా వుందో అనుకుంటున్నాడు కాబోలు మద్రాసులో ఆయన"

నలుగురూ పోగై ఇట్లాగ మాటాడుకుంటున్నారు.

ప్రేమ అనేది కవుల కల్పనా ప్రపంచంలోనేగాని మానవుల వాస్తవిక ప్రపంచంలో లేదంటాను. కామచింత వయోసహజమైంది. కాకా, ఆయనమీద మీదనే 'ప్రేమ' నాకు ఇల్లాంటి సంఘటనలోంచి తప్పుకునే అంత శక్తి యివ్వలేదు. నేచేసినది ఘోరంగా ప్రపంచం వ్యాఖ్యానం చేస్తోంది. అప్పట్లో బాగా విమర్శించింది..

ఆర్నెల్లు గడిచాయి. జగన్నాధం మా యింటికి రావడమూ మానలేదు. ప్రపంచం మామీద నిప్పులు కురిపించనూ విడువలేదు. జగన్నాధం మామగారు కూతుర్ని తీసుకుని వెళ్లిపోతూ మాగుమ్మంలోనుంచుని నన్నూ జగన్నాధాన్నీ అనరానిమాటలు అని నన్ను కొట్టవచ్చినా నాకు ఏమీ కష్టంగాలేదు.

మరో విచిత్రమైన సంగతి జరిగింది:

సాయంత్రం జగన్నాధం ఇంటికి వెళ్లి ఇంకా రాలేదు. మాయింటికి ఎదురుగావున్న తాటిచెట్టునీడలు గుడ్డివెన్నెట్లో పిల్లగాలికి ఊగుతూ భయంవేస్తూంది. అరుగుమీద నుంచుని ఎదురు తెన్నులు చూస్తున్నా.

కరణంగారు నలభయిదాటిన మనిషి చేతికర్ర నేలమీద కొట్టుకుంటూ మాగుమ్మం ఎక్కాడు. మూడువేల రూపాయలు విలువ జేసే ఇంటి దస్తావేజు నాపేర వ్రాస్తాడట—ఎందుకు? ఆవాళ తనకు చెప్పినట్టుగా వింటే—? అరుగుమీదనుంచి క్రిందపడదోస్తే, ఆ కరణంగారికి తలకి గాయంతగిలి రక్తం కాలువగా ప్రవహించింది.

చూసావా? ప్రపంచంలో ఎల్లాంటి అజ్ఞానులుకూడా వున్నారో? మళ్లా ఇల్లాంటిదాన్ని నాకు జగన్నాధంమీద కలిగేదికూడా ప్రేమ అనే అంటారా? అల్లైతే మీప్రేమకి అర్థం?

* * *

హఠాత్తుగా అవాళ మద్రాసునుంచి ఆయన వచ్చారు. అంతా కుటుంబాల్ని తెచ్చుకుంటున్నారట. అంచాత నన్నుకూడా ఈయన తీసుకుపోవాలనివచ్చారు. సాయంత్రం మెయిలుకే ప్రయాణం. బయలుదేఱనని చెప్పడానికి సాహసం లేకపోయింది.

* * *

మళ్లా మద్రాసులో—

మేము మద్రాసువచ్చి నెలరోజులు కావచ్చింది. ఓనాడు నాకు శరీరమంతా బరువుగా నిస్సత్తువుగా బాధగా తోచింది. ఆయన డాక్టర్ను తెచ్చారు. డాక్టరు చూచి హాస్పిటల్‌లో జాయిను కావాలన్నాడు.

సాయంత్రం హాస్పిటల్‌లో రోగుల మంచంమీద కదుల లేకుండా పడుకున్నాను. బడినించి మణి వచ్చింది. ఏమో చెప్పబోయి మాటాడలేకపోయాను.

ఉదయం పదిగంటలయింది.

ఆయన డాక్టరుగారితో మాటాడుతున్నారు.

'జబ్బు ఏమంటారండీ' ఆదుర్దాగా ఆయన అడిగారు,

'పుట్టినపిల్ల మాత్రం నెలలు నిండకుండానే బయటపడటం మూలాన్నీ చనిపోయింది. ఆమె కేమీ భయంలేదు."

డాక్టరుగారు సగం తెలుగూ సగం ఇంగ్లీషూ ఉపయోగించి ఈ మాటలు చెప్పారు.

"పుట్టిన పిల్ల—?" ఆయన ఏదో గొణిగినట్టు వినిపించింది.

నా హృదయం చీల్చి చేత్తో నలిపినట్టూ, నరాలు తెగినట్టూ ఫీలయాను.

మెల్లగా నిస్సత్తువగా కళ్లు విప్పాను. ఆయన ఎదురుగా నుంచున్నారు. ఆఫీసుకు వెళ్లే డ్రస్సులో వున్నారు.

"ఇది నిజమేనా?" ఉద్రేకంగా అడిగారు నేను మాటాడలేకపోయాను. నెమ్మదిగా బరువుగా కళ్ళుమూసారు:

'అమ్మ దగ్గరికి వెళ్తాను పోనియ్యి!"అని ఏడుస్తున్న మణి ఏడుపూ—

"నోర్మూయ్" అని ఆయన కేకలూ—

ఎవ్వరూ నాదగ్గరలేరు.

* * *

పదిహేనురోజుల్లో నన్ను 'రిలీపు చేశారు.'

* * *

మామూలుగా ప్రయివేటు ట్యూషను చెప్పాక బజార్లో కావలసినవి కొనుక్కుని ఇంటికి వచ్చాను.

నేనూ ఇంటో అడుగుపెట్టగానే ఆయన లోనికివచ్చారు. మాసిన గడ్డం, కుష్కించిన కళ్ళు తూలిపోతూ,

'శాంతా' వొణుకుతూ పిలిచారు

వెనక్కు తిరిగాను.

''నాతో రావూ?'' ఆయన ఏడ్చారు. నాకు దుఃఖం పొర్లివచ్చింది.

"నన్ను క్షమించారా?"

"నాకోసం.... కాకపోయినా, మణికోసం నాతో రావూ?" బ్రతిమాలినట్టుగా పిలిచారు.

ఆయన ప్రేమకు నాశరీరం ప్రజ్వలించింది.

* * *

మళ్లా ఆయన ఉద్యోగంకోసం ఆఫీసువేళకి వంటచెయ్యడమూ, భోంచేశాక తమలపాకులు ఇస్తే ఆయన ఆఫీసుకు వెళ్లడమూ, ఐదుకొట్టేవరకూ కనిపెట్టుకుని కాలక్షేపం చెయ్యడమూ యధాప్రకారంగా జరుగుతున్నాయి.

మీరంతా మనుష్యులు! అయన్ను చాతగాని వాడుగా తిట్టారు:

—మణికి నాపూర్వ జీవితం తెలుస్తుందేమో, నన్నెలా భావిస్తుందో అనే భయం తప్ప నా జీవితంలో ఎల్లాంటి అంశం ప్రపంచం కలిగించలేకపోయింది.